క్లుప్తంగా

సమన్వయంతో పని చేయాలి



అధికారులతో చర్చిస్తున్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా సీసీ రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇరు శాఖల అధికారులతో మాట్లాడి సమన్వయ పరిచారు. అదే విధంగా డివిజన్‌లో వివిధ కాలనీల్లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యల గురించి, డివిజన్‌లో జరగాల్సిన పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, డిజిఎం వెంకటేశ్వర్లు, మేనేజర్లు ఝాన్సీ, ప్రశాంతి, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రవీందర్ రెడ్డి, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: శంషీగూడ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాథ్‌యాదవ్, ఎస్టీసెల్ అధ్యక్షుడు వెంకట్‌నాయక్, పోశెట్టి గౌడ్, శేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, నాగరాజు, శివ, ప్రసాద్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన వివిధ కాలనీల ప్రతినిధులు

దుండిగల్: ప్రజా సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభ కార్యాలకు రావాల్సిందిగా కోరుతూ ఆయనకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

మురుగునీటి కాలువల పనులకు శంకుస్థాపన

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని డి. సంజీవయ్య కాలనీలో 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు.

యూజీడీ పనుల పరిశీలన



భాగ్యనగర్‌కాలనీ చేపట్టిన యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో చేపడుతున్న యూజీడీ పైపులైన్ నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు దాసు, కీర్తి కుమార్, బాలు, హరిబాబు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి



పాపారాయుడు నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నిధులతో కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడు నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శివ ప్రకాష్, కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, నర్సింగ్‌రావు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం

- ఊరూరా చెరువుల పండుగ
- ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: చేపలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నేడు తెలంగాణ రాష్ట్రం ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం భౌరంపేట్ పెద్ద చెరువు, గాజులరామారం చింతల చెరువు, బాచుపల్లిలోని భైరుని చెరువుల వద్ద ఏర్పాటు చేసిన ×ఊరూరా చెరువుల పండుగ×లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులతో కలిసి చెరువు కట్టుకు ఊరేగింపుగా వెళ్లి కట్ట మైసమ్మ తల్లికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గోరేటి వెంకన్న రాసిన చెరువోయి.. మా ఊరి చెరువు, బతుకమ్మ పాటలను వినిపించారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన మిషన్‌కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. పదేండ్ల క్రితం ఏ చెరువును చూసినా ఒక్క చుక్క నీరు ఉండేది కాదని, చెరువులను కాపాడాలనే సోయి కూడా గత పాలకులకు ఉండేది కాదన్నారు. చెరువులపై ఆధారపడిన మత్స్యకారులు ఉపాధి లేక విలవిలలాడుతున్న నేపథ్యంలో మిషన్ కాకతీయ పథకం వారి బతుకుల్లో జీవం పోసిందన్నారు. మండువేసవిలో సైతం చెరువులన్నీ నిండుకుండల్లా కనిపిస్తున్నాయంటే అది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. చెరువుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా గంగపుత్రుల జీవనోపాధి పెరిగిందని, అంతరించి పోతున్న కులవృత్తులను కాపాడటానికి బీఆర్ఎస్‌ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత, డీసీలు మంగతాయారు, ప్రశాంతి, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, ఇరిగేషన్ డీఈఈ సురేష్, అధికారులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారంలోని చింతల చెరువు గట్టుపై మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, జెడీసీ మమత

ప్రజాప్రతినిధులు భూబకాసురులుగా మారారు

రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డా. మల్లారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

నిజాంపేట్: అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భూబకాసురులుగా మారారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లతో గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదన్నారు. బాచుపల్లి- నిజాంపేట్ రోడ్డు, బాచుపల్లి- మియాపూర్ రోడ్ల అభివృద్ధిని అటకెక్కించారని ఆరోపించారు. అధిక ఇంటి పన్నులు వసూళ్లపై దృష్టి సారిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికంగా అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. రోడ్ల విస్తరణ, అభివృద్ధిపై త్వరలోనే కార్యాచరణ రూపొందించుకుని ఉద్యమిస్తామన్నారు. వందలాది ఎకరాలు ఫార్మా కంపెనీలకు కేటాయించిన ఏ ఒక్క కొత్త కంపెనీ రాలేదని, కమీషన్ల కోసం అధికార పార్టీ ప్రభుత్వ భూములను ధారదత్తం చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నిజాంపేట కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి నరేంద్ర చౌదరి, పార్లమెంట్ సోషల్ మీడియా కో కన్వీనర్ సుమన్ రావు, సీనియర్ నాయకులు ఏనుగుల నరసింహారెడ్డి, 7వ డివిజన్ అధ్యక్షుడు జక్కుల రవికుమార్‌యాదవ్, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సూచనలను పరిగణలోకి తీసుకోవాలి

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్



జన సంపర్క్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కె. లక్ష్మణ్

కూకట్‌పల్లి: ప్రధానమంత్రిగా మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జన సంపర్క్ కార్యక్రమాన్ని బీజేపీ నిర్వహిస్తోంది. అందులో భాగంగా కూకట్‌పల్లి బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పీఎస్‌ఎం స్కూల్ ఆడిటోరియంలో పూర్వ, సీనియర్ నాయకుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. కె.లక్ష్మణ్, కూకట్‌పల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సీహెచ్. హనుమంతరావు, గౌరవ అతిథిగా బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలన, సాధించిన విజయాలు గురించి పూర్వ, సీనియర్ నాయకులతో చర్చించారు. సంస్థాగత పార్టీ నిర్మాణం కోసం గతంలో పార్టీ కోసం పనిచేసిన వారి అనుభవాలు, సూచనలు, సలహాలను ప్రతి ఒక్క కార్యకర్త పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, సూర్య ప్రకాష్, శివరాత్రి దామోదర్, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, కన్వీనర్ శ్రీకర్‌రావు, నేతలు రవి, సాయి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కుత్బుల్లాపూర్: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరిని బాలనగర్ ఎక్సైజ్, మేడ్చల్ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఆదేశాల మేరకు ఏపీఈఎస్ మాధవయ్య పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద ఎండీఎంఏను విక్రయిస్తున్న మహారాష్ట్రకు చెందిన దీపక్‌మహేష్, రాజస్థాన్‌కు చెందిన మహేంద్ర చౌదరిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 7 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని ఇందిరమ్మకాలనీలో అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కడియంకు చెందిన సిరి మానస (15)కు భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న గోవిందరావు (30)కు వివాహం నిశ్చయించారు. ఈ విషయం తెలుసుకున్న మాతాశిశు సంక్షేమ శాఖ అధికారులు ఆదేశించడంతో గురువారం అంగన్‌వాడీ టీచర్లు సరిత, ఉషశ్రీ, దుండిగల్ ఏఎస్సై రాములు, మున్సిపల్ అధికారి రఘుపతిరెడ్డి, ఆర్ఐ భారతిలు వివాహం జరుగుతున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి వివాహాన్ని ఆపేశారు.

రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు

భాగ్యనగర్‌కాలనీ: అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సిఐ సురేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట సఫ్దార్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ బాబా, నుషరత్‌లు రేషన్ షాపు దుకాణాలు, సామాన్య ప్రజల నుంచి తక్కువ ధరకే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ డబ్బులకు విక్రయిస్తారు.

ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ అమీర్ (34)కు లాభానికి సుమారు 13.84 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విక్రయించారు. వారి వద్ద నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అమీర్ కర్ణాటకలో విక్రయిస్తాడు. ప్రభుత్వం పేద ప్రజల కోసం రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తుంటే బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీని గుర్తించి మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్లో పట్టుకున్నారు. లారీ యజమానిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి 13,840 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌కు విక్రయించిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరినీ రెగ్యులరైజ్ చేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూహెచ్‌లో గురువారం జరిగిన యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాల నుంచి విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. వీరు అడిగే దాంట్లో న్యాయం ఉన్నదని ప్రభుత్వం వీరి డిమాండ్‌ను అంగీకరించాలని తెలిపారు. ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులు అందరికి తమ మద్దతు ఉందని తెలిపారు. న్యాయవాది జీవీఎల్ మూర్తి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ చట్టం ప్రకారం సాధ్యమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్ జేఏసీ నాయకులు డాక్టర్ ఎం. రామేశ్వర రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, రేష్మ రెడ్డి, దశరథం, రాజేష్‌ఖన్నా, కరుణాకర్‌రెడ్డి, మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి ఇండస్ట్రియల్ నుంచి దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం వరకు రూ.1.90 కోట్లతో నూతనంగా చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీ దేవేందర్, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవేందర్, శివ, ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బీజేపీ



కరపత్రాలను అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: గడప గడపకు బీజేపీ భరోసా పాదయాత్ర కార్యక్రమం గురువారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో జరిగింది. మల్లికార్జుననగర్ కాలనీలో పర్యటించిన వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ... అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీధి దీపాలు సరిగా వెలగడం లేదన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పప్పు పటేల్, కర్క డాకయ్య, సంతోష్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, అమర్‌గౌడ్, మనోజ్‌యాదవ్, రఘు, లక్ష్మి, వాణి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు పింఛన్లు ఇస్తాం

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉద్యమకారులకు పింఛన్లు అందజేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, జీతయ్య, ప్రవీణ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొలన్ జీవన్‌రెడ్డి, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యారంగం సమస్యలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఎంఈఓ కార్యాలయం ఎదుట గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఎలాంటి గుర్తింపు, అనుమతులు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మహానగర కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. గుర్తింపు లేకుండా అడ్మిషన్స్ తీసుకున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవంతోపాటు యాజమాన్యలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ప్రతి స్కూల్‌లో స్పోర్ట్స్ గ్రౌండ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలో మూడు రోజులుగా జరుగుతున్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిసాయి. గురువారం నిత్య ఆరాధన, బాల భోగం, మహా పూర్ణాహుతి, స్వామి వారికి శత ఘటాభిషేకం 108 కళశాలతో చక్రస్నానం, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సాయిబాబాకు పూజలు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ దత్తాత్రేయకాలనీలో గురువారం శ్రీ సాయిబాబా దేవాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వి. జగదీష్, వాసుదేవరావు, కె. మధుసూధన్, కె. రామకృష్ణ, డి. సత్యనారాయణ, డిజిఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బాలానగర్: మతిస్థిమితం లేని ఓ యువతి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇందిరానగర్‌లో మహబూబియా తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని చిన్న కూతురు పర్వీన్ బేగం (22) ఈనెల 7వ తేదీన ఉదయం 8గంటలకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తాం



కేపీహెచ్‌బీ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి 6కోట్ల 35 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మహానగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

◆ అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి అడిగిన వెంటనే నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలైన పార్కులు, ఇండోర్ స్టేడియాలు, మంచినీరు, సీసీ రోడ్లు, అండర్ పాస్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు వేల కోట్లతో పనులు పూర్తి చేసుకున్నామన్నారు. ఇప్పటికి 95 శాతం పనులు పూర్తయ్యాయని, పెండింగ్‌లో ఉన్న పనులను కూడా రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు.

10న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

కేపీహెచ్‌బీ డివిజన్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 10న మంత్రి హరీష్‌రావుచే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు అందిస్తున్నామని, ప్రజలు అభివృద్ధికే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



మృతి చెందిన దంబురు రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: మూసాపేటలో నివాసముంటున్న బోణికాల దంబురు రెడ్డి మూసాపేటకు ఒరిస్సా రాష్ట్రం నుంచి వలస వచ్చి చిన్న పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించాడు. అనారోగ్యంతో హఠాత్తుగా మరణించాడు. ఆర్థిక ఇబ్బందులతో అంత్యక్రియలకు కూడా ఇబ్బంది పడుతున్న విషయాన్ని కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించి అంత్యక్రియలకు సహకరించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, సీనియర్ నాయకులు గున్నాల వినోద్, కూకట్‌పల్లి ఓబీసీ మోర్చా కన్వీనర్ కోడిచెర్ల వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా ఉండొద్దు



నిజాంపేట్: పాఠశాలల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా కాకుండా సామాజిక దృక్పథంతో ఆలోచించాలని నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ హారిజన్ స్కూల్‌ను మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపిన నీలారెడ్డి అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులో విద్య ఉండేలా చూడాలని సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ హారిక, డైరెక్టర్లు సుధీర్, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, కిరణ్, భీమ్‌రావు, శ్రీనివాస్, కుషాల్, కార్పొరేటర్లు రజిత రవికాంత్, ఆవుల పావని, రాజేశ్వరి, బొర్రా దేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పునః ప్రారంభం

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన బచ్‌పన్ స్కూల్ 6, 7వ తరగతి విద్యార్థులు పాఠశాల పునః ప్రారంభం నేపథ్యంలో గురువారం స్థానికంగా ఉన్న శ్రీహరిహర అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు ప్రసాదించాలని కోరుతూ అర్చకులతో సరస్వతి శ్లోకం చెప్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేద గౌడ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటాం



సుభాష్‌నగర్: పేద గౌడ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటామని శ్రీనూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పటేల్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం గండిమైసమ్మలోని తన క్యాంప్ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం సమత్ మోతె గ్రామానికి చెందిన జంగం పుల్లయ్యగౌడ్, శారద దంపతుల రెండో కుమార్తె సాత్విక వివాహం నిశ్చమైంది. ఈ నేపథ్యంలో పుస్తె, మెట్టెలు అందజేశారు. ఇప్పటి వరకు శ్రీనూతన గౌడ సంఘం తరపున 153 మందికి పుస్తె మెట్టెలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు పత్రాల యాదగౌడ్, మేడ్చల్ జిల్లా నాయకులు శేఖర్‌గౌడ్, వీరేష్‌గౌడ్, దేవేందర్‌నగర్ అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గొర్రెల పంపిణీ

- 192 యూనిట్ల పంపిణీకి రంగం సిద్ధం
- మూడేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- మిగతా గొర్రెల యూనిట్లను ఆగస్టు వరకు పంపిణీ

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సంక్షేమ సంబురాల్లో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ ఉత్సవాల నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించి.. ఆగస్టు చివరి నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో మిగిలిన లబ్ధిదారులకు మేలుచేకూరనుంది. కుల వృత్తులకు జీవం పోయాలని నిర్ణయించిన ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని గొల్ల, కురుమలకు రాయితీపై గొర్రెలను ఇవ్వడం ద్వారా ఉపాధి చూపిస్తోంది. గొల్ల కురుమలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 2017న గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాయితీపై రెండు విడతలుగా వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది.

సంబురాల్లో 192 గొర్రెల యూనిట్ల పంపిణీ

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగర శివారు జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 24 గొర్రెల యూనిట్ల చొప్పున 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 192 గొర్రెల యూనిట్లను సంబంధిత లబ్ధిదారులకు అందజేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

– మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్‌లో 24 గొర్రెల యూనిట్లు, మేడ్చల్ నియోజకవర్గం కేంద్రంలో 24 గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీకి సన్నద్ధమవుతున్నారు. అలాగే, రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గొర్రెల యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. ఒక్కో నియోజకవర్గంలో 24 గొర్రెల యూనిట్ల చొప్పున మొత్తంగా 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 144 గొర్రెల యూనిట్ల పంపిణీ చేయనున్నారు.

పంపిణీ చేయాల్సిన గొర్రెల యూనిట్లు 1,248

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు మొదటి, రెండో విడతలు కలిపి మొత్తంగా గొల్ల, కురుమలకు 5,160 యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 3,865 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులు పంపిణీ చేశారు. సంక్షేమ సంబురాల్లో మరో 48 గొర్రెల యూనిట్లను పంపిణీ చేసేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. రెండో విడతలో మిగిలిన 1248 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులకు ఆగస్టు వరకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన గొల్ల, కురుమలకు ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలు కొనుగోలు చేసి.. పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలో డీడీలు చెల్లించని సొసైటీ సభ్యుల్లో అవగాహన పెంచుతోంది.